# సంధ్యా సమస్యలు

రచన; శ్రీ ఆడారి వెంకటరమణ (దీపశిఖ)



జుంతారు పొదిగిన పట్టంచు చీరలా ఉన్న పశ్చిమాకాశం చీకటిని పరలను మింగుతూ వస్తున్న ఓ శుభ సాయంసమయాన. ముచ్చటగా మూడు సమస్యలతో సతమతమవుతున్న ముగ్గురి మానవుల సమస్యా కథనం. అతిశయోక్తులు అతికినట్లు అన్వయించుకోండి. అట్లా చేయనివారు శిక్షార్హులు. సారీ రక్షించిన వారవుతారు.

* * *

మాయని డ్రస్ మాసిపోయినట్టు ఫీలయి బట్టలుమార్చుకొని, ముద్దొస్తున్నట్టుగా 'మమ్మీ' దగ్గరకెళ్ళి, మూడు రోజులనుండి ఆకలిగా ఉన్న వారి సంగతి మరచిపోయి, మూడ్రోజులనుండి 'సినిమా' కెళ్ళలేదని గుర్తొచ్చి, తల్లికి ఫిర్యాదుచేసి, తల్లి సిఫార్సు పట్టుకొని తండ్రి దగ్గరకెళ్ళి చూపించి, పర్సులోనుండి నూరురూపాయల నోటుని పట్టుకొని స్కూటర్ పై స్టైయిల్ గా పోయాడు రెండు పదుల గోపి.

ఇతడు షికారుకు స్కూటర్ పై వెడతాడు సారీ వెళతారు. కాలేజికి కార్లో వెడతారు. షికారులాంటి సినిమాకు మాత్రం కారు లేక స్కూటర్ వెడతారు.

[illegible]వితం బాట ముళ్ళులేని గులాబీ తోట. ఇతను తొడిగే బట్టలు టెర్లిన్ వి. ఇతనుపొదిగేవి డన్ లప్ బెడ్స్ ఇతను కూర్చునేవి కుషన్ చైర్లో. మాట్లాడేది ఇంగ్లిషు లాంటి తెలుగు. ఫ్రెండ్స్ మూడుకోట్లు తక్కువకాని వారసులు.

ఇతను మాట్లాడితే ముత్యాలు రాల్తాయి, కూర్చుంటే కుర్చీలు వెల వెల పాలిపోతాయి. నుంచుంటే కాళ్ళు కందిపోతాయి. సిగరెట్ కాల్చని పెదాలు ఎర్రగా చూడగానే ముద్దొస్తాయి. ముద్దుపెట్టుకోవా లనిపిస్తుంది. ఇతని క్రాపు జానపద హీరో విగ్గులా ఉంటుంది (విగ్గేనేమో అనుమానమే) కొద్దిగా ఉబ్బిన (ఎందుకబ్బాయో అనవసరం) రోజా బుగ్గలపై కనిపించనంత పెరిగినగడ్డం వింత అందాన్ని చూసేవారికి పంచుతూంది.

ఎత్తు అయిదు ఎనిమిది. ప్లస్ బూటు ఒక అంగుళం కలిపి అతని ఎత్తు అయిదు అడుగుల తొమ్మిది అంగుళాలు అని చెప్తూంది.

స్కూటర్ నాలుగురోడ్ల కూడలిలో ఆగింది.

ఫ్రెండ్స్ ఎవరూ మీటవలేదు. ఏ పిక్చర్ కెళ్ళాలి? తను చూసిన ఈ ఊర్లో ఉన్న ఒకే ఒక ఇంగ్లిషు సినిమా మారలేదు. ఛీ...ఛీ"...డర్టీసిటీ" కోపంవచ్చిందిపట్టణం పైనే! తలచుకుంటే తను చూసే సినిమాలకోసం మరో సినిమాహాలు కట్టించగలడు. కాని ఆ అదృష్టం మనకు లేదు. కారణం ఈ ఆలోచన అతనికి రాలేదు.

జంక్షన్ లోని వాల్ పోస్టర్ల వేపు దృష్టి సారించాడు. కనిపించిన మొదటి పోస్టర్ ఏడుస్తున్న స్త్రీ కన్నీరు కాల్వలై సారీ ఏరులై ఇంకా సరిపోలేదేమో నదులై ప్రవహిస్తున్న కొవ్వొత్తి స్త్రీ, ప్రక్కనే కాలిపోతున్న ఇళ్ళల్లోనుండి ఆదరా బాదరాగా పరుగెత్తుకొస్తున్న ప్రజానీకం పెద్దక్షరాలతో ఆ సినిమా పేరు.

ఏమో ఏమనుకున్నాడో తెలియదు. రెండో పోస్టర్ వైపు చూశాడు. నారబట్టలు ధరించి బాణం పట్టుకున్న రాముడు ప్రక్కనే విలపిస్తున్న సీతాదేవి రావణుని సన్నిధిలో రాక్షసుల చెంత పురుగులా చూశాడు అటువేపు.

దృష్టి ప్రక్కకు త్రిప్పాడు. 'రవికలేని వక్షం, కనిపించే తొడల్ని వలుపుతున్న విలన్ ఆ లక్ష్మిదేవి కళ్ళు తాగిన మైకంలోనో, నిర్మాతల మైకంలోనో కైపుతో తేలిపోతున్నాయ్. ఆటూ ఇటూ చూసి థియేటరు పేరు జూసి, స్కూటర్ స్టార్ట్ చేసి, ఎవరో తరుముకొస్తున్నట్టు పోయాడు.

బాల్కనీలో కూర్చున్నాడు.

విశ్రాంతి టైములో ప్రక్క కూర్చున్న మగువ లెవరయినా చూస్తున్నారేమోనని సిగరెట్ కో, చాకొలెట్ కో పైకి వెళ్ళాడు.

మనం మరొకడి దగ్గర కెడదాం.

ఆ సాయంత్రం—

బట్టలు మాసిపోయినా మాయనట్టు ఫీలయి ఉన్న రెండు జతల్నీ కట్టుచేయడ మెందుకని, డ్రస్ కేసి మరో సారి చూసి, మనసుని సంతృప్తి పరచుకొని, భార్య దగ్గర కెళ్ళి, మూడు నెలల ఆకలిమంటతో ఉన్నవారి

సంగతి మరచిపోయి, నెలరోజులనుండి హోటలు కెళ్ళలేదని గుర్తుకొచ్చి, భార్యదగ్గర తెల్లకాగితాల వంకపెట్టి భార్య మెల్లో ఉన్న రెండు రూపాయలు సంపాదించి, సైకిలెక్కి నేరుగా పోయాడు ఇరవైపదుల ఎస్. జి. ఓ. గోపాలం.

ఇత నెక్కడికి వెళ్ళినా, సైకిల్ పైనే వెడతాడుసారీ వెళుతుంటాడు. ఇతని జీవిత బాట, రాళ్ళపై సైకిలు త్రొక్కుతున్నంత ఒడుదొడుకులు కలది. ఇతడు తొడిగే బట్టలు ఖద్దర్వి. ఇతను పడుకునేది అరిగిపోయి తెగిపోయిన ముడులున్న పట్టె మంచంపైన. ఇతను కూర్చునేది పెళ్ళి నాడు ఫ్రెండు చదివించిన ఇనుప కుర్చీపైని. ఇతను మాట్లాడేది,ఫ్రెండ్సు మూడొందల ఎస్. జి. ఓ. లతోటి.

ఇతను మాట్లాడితే కళ్ళు కనబడతాయి,

ఇతను కూర్చుంటే లేని అందం కుర్చీల కొస్తుంది.

ఇతను నుంచుంటే భూమికి చెమటపడుతుంది.

చుట్ట కాల్చే పెదాలు వేడికి కందిపోయి ఉంటాయి.

ఇతని క్రాఫ్ కు 'దిలీప్ కుమార్'ది సరిపోవచ్చు. నల్లని బుగ్గలపై మూడు రోజులు పెరిగిన గడ్డం దోబూచులాడుతూ చూసేవారికి 'జాలి' పంచుతోంది.

ఎత్తు ఐదడుగుల ఆరంగుళాలు.

చూడగానే పెళ్ళయిన వాడిలా కనిపిస్తాడు.

సైకిల్ నాలుగురోడ్ల జంక్షనులో ఆగింది,

తన మిత్రులు కనిపిస్తారేమోనని భయం భయంగా అటూ ఇటూ చూశాడు. ఎవరూ కనిపించలేదు. ధైర్యం తెచ్చుకొన్నాడు. దేవుడిపై భారంవేసాడు. సైకిల్ స్టాండువేసి, జాగ్రత్తగా తాళంవేసి, నేరుగా హోటలోకి అడుగెట్టాడు.

ఒక్కసారి టిఫిన్ రేట్లు చూశాడు.

అన్నింటిపైనా క్యాలండర్ తేదీల అంకెలు డబుల్ రేట్లలో కొత్తగా అంటించబడి చద్విలాసంగా వెక్కిరిస్తున్నాయి.

ప్రక్కనున్న ప్లేట్లోకి జూశాడు, అరచేయంతుండే ఇడ్లీ ఇప్పుడు అరచేయిలోని చంద్రుడంతున్నాది.

పుల్లదోశ వేపు చూశాడు. గుండె తరుక్కుపోతోంది. అప్పటి తవదోశ ఎన్నోరేట్లు నయం.

స్వీటువేపు చూస్తే కళ్ళనీళ్ళ పర్యంతం అయింది:

నోరు జారితే ప్రక్కవాడి చెవులో పడుతుంది. పాత బేడ కాసంతుంది.

అటూ ఇటూ చూసి మసాలాదోస చెప్పాడు. కూర ఎక్కువ తగిలించొచ్చని.

మసాలాదోస వచ్చింది. తలొంచుకు తింటూ, మంచి నీళ్ళకోసం తలెత్తాడు. మిత్రుడు మిష్టర్ ఎస్. జి. ఓ. కనిపించి పలకంగా, వెలవెలబోతూ నవ్వుతున్నాడు. మంచినీళ్ళ గ్లాసనుకొని, ఉత్తనీళ్లులేని గ్లాసును గబగబ నోటికి అందించాడు. నీరు నోట్లోకి రానికారణం గ్రహించి, ప్రక్కన పెట్టి బరువుగ్లాసు ఎత్తి అందరూ జూస్తూడగానే ఆత్రంగా గ్లాసు పూర్తిచేసాడు.

పైకి వచ్చేసరికి జేబునికూడా ఖాళీచేసాడు మిత్రుడు.

♦ ♦ ♦

అదే సాయంత్రం—

బట్టలు చిరిగిపోయినా, క్రొత్త బట్టల్ని చూసుకొన్నంత ముద్దుగా మురిపెంగా వాటినే మరొకసారిచూసుకొని, ఇంట్లో మరో గోనెగుడ్డలాంటి చిరిగిపోయిన పైజామా, లాల్చీ ముందొచ్చే పండక్కి (బ్రతికుంటే) పనికొస్తుందని తలంచి, 'అప్పు' అన్వేషణ దూడుడై ప్రయాణమయ్యాడు అప్పుల గోపాలస్వామి.

అప్పు దొరకందే ఇంటి కడితే, పిల్లల ఆకలి, భార్య గోడు చూడలేక, ఆకలిబాధ పడలేక, ఆపదలో కారుస్పడులా పరుగత్తేకాళ్ళతో, మూడ్రోజులుగా మంచినీళ్ళతోనే గడిపిన కళేబరాన్ని మోసుకుంటూ, పరుగులాంటి నడకతో, కనిపించిన వాడిని అప్పు అడుగుదామని, అప్పు ఇచ్చినవాడు కనిపిస్తే, ఆత్మహత్య చేసుకుందామని నేరుగా, నేర్పుతో నాలుగురోడ్ల కూడలి చేరుకున్నాడు దరిద్రనారాయణుడు బిరుదాంకిత మిష్టర్ అప్పుల గోపాలస్వామి.

గోపాలస్వామికి ఆరోజు దుర్దినమని చెప్పక తప్పదు. ఆరోజు మీటింగవుతోంది కూడలిలో. ఎటుచూసినా అప్పులవాళ్ళే కనిపిస్తున్నారు. ఇంటికి వెళదాం అంటె బిడ్డల ఆకలి.

మెరపులాంటి ఆలోచన.

అప్పులవాళ్ళ పోగరణిగేలా సముద్రంలోపడి ఆత్మహత్య చేసుకుంటే? .....వెంటనే పీకితనం పరుగెత్తుకొచ్చింది నేనున్నానంటూ .....పోలీసులు పట్టుకొని కోర్టుకి అప్పగిస్తే?

పోనీ 'ఉరి' వేసుకుంటే?... అమ్మో బాధ ఏ బాధ లేకుండా పెంచిన శరీరాన్ని కాడు తగిలించడమా? ఇంపాజిబుల్, ఈ బాధ భరించడం నావల్లగాదు బాబూ.........

స్లీపింగు టాబ్లెట్స్ వేసుకుంటే?

అవి కొనడానికి డబ్బులుంటే తన ఆత్మహత్య మరో రోజుకి వాయిదా పడేదే!......మరెలా......

అప్పులవాళ్లు చుట్టుముట్టేలా ఉన్నారు ఎలా?...ఆ( వచ్చే లారీలో పడితే...అమ్మో...వద్దు...వద్దు...ఏ కాలో చెయ్యో పోయి ప్రాణంపోనంటే? ఎలా? భగవంతుడా?......

ఈ అప్పుల గోపాలస్వామి బాధ ఎవడి కెరుక తిరుమలేశ? పోనీ మీకు తెలుసుంటె? వెలవెల బోకండి. మరోసాయంత్రం కలుద్దాం.

[మహాకవి శ్రీ శ్రీ 'సంధ్యాసమస్యలు' ఆధారంగా.
రచయిత]